
ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025

5


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'అమరజీవి'కి నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు : పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకై ప్రతీ ఒక్కరూ కషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ ఆకాంక్షించారు. ఆదివారం ప్రభుత్వ నిర్దేశాల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు 125 వ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ఆత్మకూరు బస్టాండ్ కూడలిలోని ఆయన విగ్రహానికి కమిషనర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు కమిషనర్ మాట్లాడుతూ అంటరానితన నిర్మూలన, సమసమాజ స్థాపన, దళితుల దేవాలయాల ప్రవేశానికై జీవిత చరమాంకం వరకు పోరాడిన అభ్యుదయవాది అని పొట్టి శ్రీరాములును కొనియాడారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ నందన్

సుందరయ్య విప్లవ స్ఫూర్తి..

ఉద్యమాలకు వేగుచుక్క - నేడు 40వ వర్ధంతి

సుందరయ్య నేటి తరానికి ఆదర్శనీయులు ..రాజకీయాల్లో ఇలాంటి నేతలు నేడు కనిపించం లేదు.. రాజకీయాలంటే ప్రజలకు సేవచేయడం, కష్టమొచ్చినప్పుడు వారి పక్కన నిలబడటం.. వారి కోసం పోరాటం చేయడం.. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు రాజకీయాలకు అర్థం మారిపోయింది. డబ్బు ఎంత ఎక్కువుంటే వారే బడా నేత.. జనానికి తాయిలాలు ఎవరు ఎక్కువ ఇస్తారో వారే విజేత అన్నట్లు మారిపోయింది. రాజకీయాలంటే ప్రజలకు సేవచేయడం అని పుచ్చలపల్లి సుందరయ్య ఏ నాడో నిరూపించారు. 1913 మే 1న జిల్లాలోని విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఉదయించిన ఎర్ర సూర్యుడు... 1985 మే 19న అస్తమించారు. ఒక సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం దేశానికి మార్గదర్శిగా మార్చింది. నేడు ఆయన 40వ వర్ధంతి. అలాంటి నేతను గుర్తుపెట్టుకున్నప్పుడే బ్రావితరాలం ముందుకు వెళ్తాయి.,

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

పుచ్చలపల్లి సుందరయ్య.. ఈ పేరు ఇంటే ఉద్యమకారులకు చైతన్యం.. సాధారణ ప్రజలకు స్ఫూర్తి.. రాజ కీయ నేతలకు మార్గదర్శి.. కోట్లాదిమందికి విప్లవ స్ఫూర్తి.. చివరి రక్తపుబొట్టు వరకు ఎర్రజెండాను దేశవ్యాపితంగా రెపరెపలాడించిన సింహపురి ముద్దుబిడ్డ. భరతమాత ప్రియ పుత్రులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరతకు ఆయన నిలువుటద్దం.. నిత్య అధ్యయన శీలి. క్రమశిక్షణకు పెట్టింది పేరు.. అపార విజ్ఞానవంతుడు.. తెల్లటి పైజామాలో గొంగళి పైన కప్పుకొని నిర్మలంగా కనించే విప్లవమూర్తి. విడవలూరు మండలం అలగానిపాడు గ్రామంలో పుచ్చలపల్లి శేషమ్మ, వెంకటరామిరెడ్డి దంపతులకు 1913 మే 1న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. బాల్యం నుంచే అభ్యుదయ భావాలున్నాయి. అమీర్ హైదర్‌ఖాన్ ప్రోత్సాహం.. స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమం వైపు అడుగులేశారు. తన తుది శ్వాసవరకు పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం పోరాడారు. విశాలాంధ్రలో పజా రాజ్యం రావాలని సుందరయ్య ఆశించారు. విశాలాంధ్ర ఏర్పాటు జరిగింది. ప్రజారాజ్యం రాలేదు. సుందరయ్య కలలుకన్న విశాలాంధ్ర ఇప్పుడు రెండు ముక్కలైంది. ప్రజల జీవన పరిస్థితులు మారిపోయాయి.

చిన్ననాడే ఉద్యమ బీజాలు...!

సుందరయ్య తన స్వగ్రామం నుండే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 15 ఏళ్ల పసిప్రాయంలో ప్రజల కోసం పెద్దలను ఎదిరించి నిలిచారు. వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారు. అక్కడ నుంచే ఉద్యమం ప్రారంభించారు. వ్యవసాయ కూలీలకు న్యాయమైన కూలీలు అందించేందుకు ఆయన పునాది వేశారు. 1936లో గ్రామంలో కూలీ సంరక్షణ సంఘం ఏర్పాటు చేశారు. దానిని రాష్ట్ర వ్యాపితంగా విస్తరించి వ్యవసాయ కార్మిక సంఘం నిర్మించారు. ఆ సంఘం ఇప్పుడు దేశవ్యాపితంగా వ్యవసాయ కార్మికులకు అండగా అతి పెద్ద సంఘంగా ఏర్పడింది. సుందరయ్య స్ఫూర్తితో దేశంలో అనేక కూలీ పోరాటాలు సాగుతున్నాయి. స్వామి వివేకానంద ఉపన్యాసాలకు సుందరయ్య ఆకర్షితులయ్యారు. ఆయన సోదరులు డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నబాటలోనే నడిచారు. పేద ప్రజల పట్ల ప్రేమానురాగాలు పెంపొందించుకొని ప్రజల మనుషులుగా మారిపోయారు. సుందరయ్య రష్యా సోషలిజం- విప్లవం గురించి అధ్యయనం చేశారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షణ భారత దేశానికివచ్చిన అమీర్ హైదర్‌కాన్ సుందరయ్యను ఎంతగానో ప్రోత్సహించి కమ్యూనిస్టుపార్టీ అభివృద్ధికి బాటలు వేసేలా చేశారు. దేశం గర్వించదగ్గ నేతగా ఆయన ఎదిగారు. ఇప్పటికీ సుందరయ్య చరిత్రను రాజకీయ నేతలు అధ్య యనం చేస్తారంటే ఆయన నిబద్ధత, నిజాయితీ అర్ధమౌతుంది. చిన్నపాటి పదవివస్తేనే కోట్ల సంపాదించుకునే ఈ రోజుల్లో ఆయన తన ఆస్తిని సైతం పేదల కోసం ఖర్చుచేసిన త్యాగజీవి,. పార్లమెంట్‌కు సైకిల్ మీదకు వెళ్లిన ఒకే ఒక్కరు మన సుందరయ్య. ఇది ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఆయన స్ఫూర్తి ప్రధాత అలాంటి నేతను శాటిలైట్ వేసుకొని దేశమంతా వెతికినా ఎక్కడా కనిపించరు. అది మన సుందరయ్య నిజాయితీ, ఆ మహనుభావుడు వర్ధంతి నేడు.. ఆయన జ్ఞాపకాలు మాత్రం మనపక్కనే బుజంతట్టి నిద్రలేపుతున్నాయి.

సమసమాజం కోసం....!

సుందరయ్య విశాలాంధ్రలో ప్రజారాజ్యం రావాలి.. చూడాలని పోరాటం చేశారు. 1942లో విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే పుస్తకం రచించారు. సుందరయ్య ఆశించినట్లు చెన్నెయ్ నుంచి రాష్ట్రం విడిపోయి తెలంగాణా, రాయలసీమ, కోస్తా ప్రాంతాలు ఒక్కటై విశాలాంధ్ర ఏర్పాడింది. ప్రజా రాజ్యం కోసం సుందరయ్య పనిచేశారు. రాష్ట్రంలోని వనరులు, అభివృద్ధిపై మీద సమగ్ర అవగాహన కలిగిన నేత ఎవరైనా ఉన్నారంటే అప్పట్లో సుందరయ్య మాత్రమే. విశాలాంధ్ర రెండు ముక్కలైపోయింది. పాలకులు ప్రజా సంక్షేమం, అభివృద్ధి, నిజాయతీ వంటి అంశాలను పట్టించుకోకుండా పదవంటే కేవలం అధికారం కోసం అనేలా వ్యవహరిస్తున్నారు. సుందరయ్య లాంటి మహనుభావులను స్మరించు కుంటేనైనా భావితారాలకు భవిష్యత్తు ఉంటుంది. తరాలు మారినా, యుగాలు గడిచినా సుందరయ్య ముద్ర ప్రజల్లో ఎప్పటికీ ఉంటుంది.



పుచ్చలపల్లి సుందరయ్య

నిబద్ధతగల కమ్యూనిస్టు..

పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వ్యక్తులను మనం ఇప్పటి కాలంలో చూడగలమా..నీతి, నిజాయతీ, నిబద్ధత, క్రమశిక్షణ వీటికి రూపముంటే అది సుందరయ్య. తన ఆస్తిని పేదలకోసం ఇచ్చేసి, పిల్లలు పుడితే స్వార్ధం వస్తుందని భావించి తన పిల్లలు లేకుండా తన పార్టీ కార్యకర్తలే పిల్లలుగా చివరి వరకు నిలిచారు. చిన్నపాటి పదవి వస్తే పెద్ద పెద్ద కార్లలో తిరిగే ఈ రోజుల్లో పార్లమెంట్ ప్రతిపక్షనేతగా ఉండి. సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లిన వ్యక్తి.. రాజకీయాలంటే డబ్బు, అనే ఈ రోజుల్లో ప్రజల కోసం పనిచేయడం, తానునన్ననే భరోసా కల్పిం చడం ద్వారా ఆయన ప్రజల మనిషిగా మిగిలి పోయారు. సుందరయ్య లాంటినేతలను మళ్లీ మనం చూస్తామో లేదో తెలియదు. సుందరయ్య తుది శ్వాసవరకు పేదల కోసమే ఆలోచించారు. జీవించారు. ఆరోగ్య సహకరించకపోయినా పార్టీ, ప్రజల కోసం పనిచేశారు. అటువంటి నేత ప్రజలకు దూరమై 39 ఏళ్ల గడిచిపోయాయి. ఆయన జ్ఞాపకాలు మాత్రం అలాగే ఉండిపో యాయి. ఆయన వదిలి వెళ్లిన బాధ్యతలు మన ముందు అలాగే ఉన్నాయి. ఆయన ఆశయసాధన కోసం పనిచేసినప్పుడు ఆ మహనుభావుడికి మనం ఇచ్చే నివాళి..!

మైనింగ్ ఒక్కరే దోపిడీ చేస్తున్నారు..!

- లీజుదారులు కన్నీళ్లు ప్రభుత్వానికి కనిపించడం లేదు ..
- సుప్రీంకోర్టు ఆదేశాలు బుట్టదాఖలు
- మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అనిల్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

సైదాపురం మైని ంగ్‌లో ఒక్క వ్యక్తి మాత్రమే దొపిడి చేస్తున్నారని, ఇప్పటికే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కంపెనీ సుమారు రూ. వెయ్యి కోట్లు దొచుకుందని మాజీ మంత్రి పి. అనిల్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమం, అభివద్ధి ఊసే లేకుండా పోయిందన్నారు. చంద్రబాబుకు తెలిసిందల్లా రాజకీయ కక్ష సాధింపు, ప్రతిపక్షంపై అక్రమ కేసులు, గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారుల అరెస్టులు మాత్రమేనని ధ్వజమెత్తారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా డీజీ ర్యాంకు అధికారి సహా మాజీ ఐఎఎస్‌లను కూడా వదలకుండా అక్రమ కేసులతో వేధింపులకు గురిచేస్తున్న దుర్మార్గపు పాలనను చూస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లాలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని చంద్రబాబు మైనింగ్ మాఫియాను పెంచి పోషిస్తున్నారన్నారు. మాఫియా కారణంగా నెల్లూరులో మైనింగ్ నిలిచిపోయి వేలాది కుటుంబాలు ఉపాధి లేక అల్లాడిపోతున్నాయన్నారు. జిల్లాలో దాదాపు 180 మైన్లు ఉంటే అందులో కేవలం 25 నుంచి 30 మాత్రమే నడుస్తున్నాయన్నారు. అది కూడా ఫైన్లు వేసిన మైన్స్ ఓపెన్ చేసి, మైనింగ్ చేస్తున్నారన్నారు. ఎటువంటి జరిమానాలు లేకపోయినా అనేక క్వారీలు ఇంకా మూతపడే ఉన్నాయన్నారు. దీనికి కారణం ఆయా క్వారీ యజమానులు ఎంపి వేమిరెడ్డి మైనింగ్ మాఫియాను అంగీకరించకపోవడమేనన్నారు. వీటిని గతంలోనే అన్ని ఆధారాలతో సహా మీడియా ముందు చూపించామన్నారు. వీటిపై వారం రోజుల్లో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరినా, ఇప్పటి వరకు ఎటువంటి స్పందనా లేదన్నారు. వేమిరెడ్డి చేస్తున్న మైనింగ్ మాఫియాపై మాట్లాడితే ఆయన కంపెనీ పెట్టుకోవడం తప్పా అంటూ టిడిపి నేత బీద రవిచంద్రయాదవ్ ఒత్తాసుగా మాట్లాడారన్నారు. తాను తప్ప ఇంకెవరూ మైనింగ్ వ్యాపారాలు చేసుకోకూడదన్న ఎంపి దురాశ కారణంగా నెల్లూరు జిల్లాలో దాదాపు 10 వేల మంది ఉపాధి కోల్పోయరన్నారు. 260 మందికి పైగా క్వార్ట్జ్ ఎగుమతిదారులుంటే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన కంపెనీ ఒక్కటే వ్యాపారం చేయడం వెనుక మతలబు ఏంటని అడుగుతుంటే సమాధానం లేదన్నారు. ఎవరైనా ఎక్స్‌పోర్ట్ చేసుకుందామని పోతే వారిని బెదిరిస్తున్నారని. రూ.7 కోట్లు ఫైన్లున్న భరత్ బాబు చౌదరి, 30 వేల టన్నులు అక్రమ మైనింగ్ చేశాడని మాల్యాద్రి నాయుడుపై ప్రభుత్వం రూ. 3 కోట్లు ఫైన్ వేసిందన్నారు. ఈ మైన్లన్నీ ఓపెన్ చేస్తే ప్రభుత్వానికి రూ. 400 నుంచి రూ. 500 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. ఎంపి మైనింగ్ అక్రమాలపై తాను ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడిన తర్వాత కొంతమందిని పిలిపించుకుని మాట్లాడుకున్నారని తెలిసిందన్నారు. . సిద్ధివినాయక, కెవిఎస్‌ఆర్, శోభారాణి వంటి 50 ఏళ్ల పర్మిషన్ గడువు ముగిసిపోయిన ఏడెనిమిది మైన్స్, పట్టాభూములను తన గుప్పెట్లో పెట్టుకుని అక్రమంగా మైనింగ్ చేస్తున్నారన్నారు. ఇలా ఏడాదికి రూ. 250 కోట్లు చొప్పున నాలుగేళ్లలో రూ. వెయ్యి కోట్లకు పైనే దోపిడీకి స్కెచ్ వేశారన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు పి. నారాయణ ఆలోచనలతో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని వి.ఆర్ విద్యాసంస్థల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న అభివద్ధి పనులను కమిషనర్ వై.ఓ నందన్ ఆదివారం పర్యవేక్షించారు. చిన్నారుల కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న కిడ్స్ ప్లే గ్రౌండ్, ఆటవిడుపు మైదానం నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించి సంబంధిత అధికారులకు వివిధ సూచనలను జారీ చేశారు.

నేడు మినీ మహానాడు

ప్రజాశక్తి-కందుకూరు : నేడు సాయంత్రం 04:00 గంటలకు ఎంయల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గ టిడిపి మినీ మహానాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరుగుతుందని ఎంయల్ఎ తెలిపారు. క్లస్టర్, యూనిట్ ,బూత్ లెవెల్ ఏజెంట్లు , తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారులకు 'ఇంటూరి' ఆశీర్వాదం


ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణం రోడ్డులోని నరిశెట్టివారిపాలెం గ్రామానికి చెందిన కామని కష్ణారావు, వెంకటరత్నం ఆహ్వానం మేరకు మనవళ్ల పంచకట్టు కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు. పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిడి వెంకటేశ్వర్లు, కామని కష్ణారావు, నాగేశ్వరరావు, నాదెళ్ల వెంకట రమణయ్య మాదాల మాల్యాద్రి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గ్రంథపాలకుడిపై గ్రామస్తులు ఆగ్రహం

ప్రజాశక్తి -గుడ్లూరు : వేసవి సెలవులు నేపథ్యంలో విద్యార్థులు గుడ్లూరులో ఉన్న గ్రంథాలయానికి చేరుకొని పుస్తకాలు చదువుకోవడానికి మక్కువ చూపుతున్నారు. అయితే గ్రంథ పాలకుడు గ్రంథపాలకుడు భవనాన్ని పరిసర ప్రాంతాలని పరిశుభ్రం చేసి వస్తేనే చదువుకోడానికి పుస్తకాలు ఇస్తానని మెలిక పెట్టడంతో విద్యార్థులు పారిశుద్ధ్యం పనులు చేయక తప్పలేదు. గ్రంథపాలకుడు నిర్వాకం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. చిన్నారుల చేత పనులు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థుల చేత పనులు చేయిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

డివైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గుడ్లూరు : యువతరం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకుగాను డివైఎఫ్ఐ గుడ్లూరు మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు కొట్టే వెంకయ్య అధ్యక్షతన ఈ నూతన కమిటీ సమావేశం గుడ్లూరు హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. డివైఎఫ్ఐ నూతన కమిటీకి కార్యదర్శిగా గుత్తి మల్లికార్జున, సహాయ కార్యదర్శిగా దాసరి సీతారాం బెల్లంకొండ నారాయణ అధ్యక్షులుగా పర్రె శీను, కోశాధికారిగా కాపులూరి వీర కష్ణ ఉపాధ్యక్షులుగా కామణి మహేష్, కమిటీ సభ్యులుగా దాసరి సీతారాం బెల్లంకొండ బ్రహ్మేంద్ర పొట్లూరి తిరుమలరావు గద్దె శేఖర్ గుండు మడుగుల మహేష్ చిత్తారి వేణు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ప్రజాసంఘాల నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు అభినందించారు.



వి.ఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం..

ప్రజాశక్తి-నెల్లూరు : నిరుపేదల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేలా విఆర్‌సి పాఠశాలను పున ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక పట్టణ అభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.ఆదివారం వీఆర్సీ పాఠశాల ఆధునీకరణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ విఆర్సీకి పూర్వ వైభవం తెస్తానని ఇచ్చిన మాట ప్రకారం అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నామన్నారు. విద్యా మంత్రి లోకేష్ ఆమోదంతో 15 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టామని, పనులు చకచకా సాగుతున్నాయన్నారు. నిరుపేద పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా స్కూల్ ను తీర్చిదిద్దుతున్నా మన్నారు.స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కు కేటాయించిన ఆరు చెత్త సేకరణ కాంపాక్టర్లను మంత్రి నారాయణ ప్రారంభించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ , మున్సిపల్ కమిషనర్ నందన్, తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి' ఉచిత మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి-నెల్లూరు : వరల్డ్ ఐబిడి డేని పురస్కరించుకోని నేటి నుంచి జూన్ 18వ తేదీ వరకు ఐబిడి అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారికి గ్యాస్ట్రో ఎంటరాలజీ డిపార్టుమెంట్ నందు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తుందని కిమ్స్ వైద్యశాల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టరు సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వేలాది ఎకరాల భూములను ప్రభుత్వం కేటాయిస్తుందే తప్ప , వాటిల్లో భూముల్లో పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవడం లేదని, జిల్లాలో శాసనసభ్యులు, మంత్రులు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి జిల్లాలో పరిశ్రమల స్థాపించి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు అనేక పరిశ్రమలు వస్తాయని తద్వారా తమ పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రజలు, తమ జీవితాలు బాగుపడతాయని నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూశారన్నారు. జిల్లాలు విడిపోకముందు ఉమ్మడి జిల్లాలో అనేక పరిశ్రమల స్థాపించినప్పటికీ ఎక్కువ శాతం తిరుపతి జిల్లా పరిధిలోకి వెళ్లాయన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే మరిన్ని పరిశ్రమలు స్థాపించేందుకు చర్యలు తీసుకుంటామని, తద్వారా జిల్లాలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చిందన్నారు.జిల్లాలో కృష్ణపట్నం పోర్టుకు సంబంధించిన కంటైనర్ టెర్మినల్ చెన్నయ్‌కి తరలించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తి కావస్తున్నా ఆ కంటైనర్ టర్మినల్‌ను పోర్టుకు తీసుకొచ్చే ప్రయత్నం స్థానిక శాసనసభ్యులు, మంత్రులు చేయలేకపోయారన్నారు. ఇప్పటికైనా కంటైనర్‌ను తీసుకురావాలన్నారు.శాసనసభ్యులు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు జిల్లా ను అభివృద్ధి చేసేందుకు తమ శక్తి మేరకు కృషి చేస్తున్నామంటూ మాటలు చెబుతున్నారే కాని చేతల్లో చూపించడం లేదన్నారు.కిసాన్ సెజ్ పేరుతో పరిశ్రమలు స్థాపిస్తామన్నారే కాని నేటికి పరిశ్రమలు స్థాపించన దాఖలాలు లేవన్నారు. విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని, అందుకు అవసరమైన భూములు సేకరించాలని ప్రభుత్వం ప్రయత్నం చేసినప్పటికీ ఆదిశగా అడుగులు పడలేదన్నారు.కావలి లో ఇటీవల పరిశ్రమలు స్థాపిస్తామంటూ ప్రభుత్వం భూసేకరణ చేసిందని,రామయపట్నం పోర్టు ఏర్పాటుకు భూసేకరణ జరిగిందే కాని ఎక్కడా పరిశ్రమలు స్థాపించిన దాఖలాలు లేవన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

జిల్లాలో రిలయన్స్ సంస్థకు పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలు ప్రభుత్వం కేటాయించినా పరిశ్రమలు మాత్రం నేటికి రాలేదన్నారు. ఆత్మకూరు నారం పేట వద్ద పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని ప్రకటించారే కాని ఆచరణకు మాత్రం నోచుకోలేదన్నారు. పరిశ్రమలు స్థాపించి జిల్లాలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ కమిటీ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో కృష్ణపట్నం పోర్టు నుంచి కంటైనర్ టర్మినల్ ను మరో ప్రాంతానికి తరలించిన తరువాత ఇండస్ట్రియల్ పరంగా జిల్లా చాలా వెనుకబడి పోయిం దన్నారు. దానిపై జిల్లాకు చెందిన శాసనసభ్యులు, మంత్రులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

సైనికులకు అండగా నిలుద్దాం..!

ప్రజాశక్తి-నెల్లూరు

అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల పీచమణిచిన భారత ప్రధానికి, సైన్యానికి దేశప్రజలు అండగా నిలవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో వేలాది ప్రజలు మనం సైతం దేశం కోసం అంటూ జాతీయ పతాకాలు చేతబూని వీఆర్సీ సెంటర్ నుండి గాంధీ విగ్రహం వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి పార్టీల నాయకులు తోడుగా యువకులు, విద్యార్థులు, మాజీ సైనికులు, వివిధ వర్గాల ప్రజలు వేయి అడుగుల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. వందేమాతరం నినాదంతో వి ఆర్ సి సెంటర్ మార్మోగింది. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ 26 మంది అమాయక పౌరులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు భారత్ తన శక్తి ఏమిటో చూపిందన్నారుఆపరేషన్ సింధూర్ పేరుతో చేపట్టిన భారత సైన్యం పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను భారత ప్రజలందరూ ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలియజేస్తూ వారికి ఘన నివాళి అర్పించారు.నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ భారతదేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదని, తనుకు తానుగా మరొకరి జోలికి వెళ్ళదని, కానీ తమ జోలికి వస్తే తాట తీస్తామని భారత సైన్యం నిరూపించిందన్నారు.ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం శాంతికాముక దేశమని చేసిన చరిత్ర ఎన్నడూ లేదన్నారు. సమయంలో విధ్వంసాలకు చిరునామాగా పాకిస్తాన్ మిగిలిపోయిందన్నారు. ఈ ర్యాలీలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికష్ణ, మాజీ సైనికోద్యోగులు శ్యాంప్రసాద్, కళాధర్, రత్నయ్య, కూటమి నేతలు నూనె మల్లికార్జున్ యాదవ్, గనుకుల కిషోర్, అశేష ప్రజలు పాల్గొన్నారు.



కళాకారులకు ' అమ్మఒడి' రంగస్థలం..

సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి

ప్రజాశక్తి - లింగసముద్రం

కళాకారులకు అమ్మఒడి 'రంగస్థలం' అని సినీ నటుడు, పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, లింగసముద్రం మండలం, పెద్దపవనిలో పావని ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎం.రాఘవేంద్రరావు స్మారక నాటక కళాపరిషత్ నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీపుల్స్ స్టార్‌గా పేరొందిన నటుడు ఆర్ నారాయణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రంగస్థల' కళాకారులకు అమ్మఒడి వంటిం దన్నారు. రంగస్థలం కళాకారులను ప్రోత్సహించినప్పుడే నాటకాలు మనుగడలో ఉంటాయన్నారు. నేటి తరం యువత వాటి పట్ల ఆసక్తి చూపే విధంగా నాటికలు ప్రదర్శించాలన్నారు. ఎం.రాఘవేంద్రరావు గొప్పతనాన్ని కొనియాడారు. అటువంటి గొప్ప కళాకారుడి శిష్యుడుగా, ఆయన సాంస్కతిక వారసుడిగా మలిశెట్టి నాగేశ్వరరావు కొనసాగడం సంతోషమన్నారు. ఈ నాటిక పోటీల కోసం ఆయన చేస్తున్న కషిని కొనియాడారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీని నాగేశ్వరరావు స్టేజి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని అభ్యర్థించారు. ఆయన సానుకూలంగానే స్పందించారు. అనంతరం ఆర్. నారా యణమూర్తి పట్టు పట్టడంతో శాశ్వత స్టేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని సభాముఖంగా, సంతోషంగా ఒప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిధులుగా నాటక, సినీ రచయిత జలదంకి సుధాకర్, కందుకూరు జనసేన నాయకుడు పులి మల్లికార్జున పాల్గొన్నారు. అనంతరం ఆర్. నారాయణమూర్తి, నూకసాని బాలాజీలు విజేతలకు బహుమతులు అందజేశారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా సౌజన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి దేవరాగం,తతీయ ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ అమ్మ చెక్కిన బొమ్మ నాటికలు నిలిచాయి.



మాట్లాడుతున్న ఆర్ . నారాయణమూర్తి

కాకర్లపాలెం రోడ్డు అస్తవ్యస్తం

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : మండలం లోని వలేటివారిపాలెం జాతీయ రహదారి నుండి కాకర్లపాలెంలోకి వెళ్లే సుమారు'.రెండు కిలో మీటర్లు రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. కంకరరాళ్లే బండల సైజులో లేచి ఉన్నాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ పట్టిం చుకునేవారే కరువయ్యారు. మెట్టల రోడ్డుపై ఉన్న మట్టి కొట్టుకపోవడంతో కంకరరాళ్లు బయటపడ్డాయి. ఆ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల టైర్లకింద కంకరరాళ్లు పడి టైర్లు స్లిప్ అయి కిందపడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా ఈ రోడ్డు అస్తవ్యస్తంపై పట్టించునే నాధుడే లేరని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంభందిత అదికారులు, పాలకులు స్పందించి ఆ రోడ్డు కిలోమీటర్లు తారురోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు..

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ సౌజన్యంతో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆకాంక్షించారు. స్థానిక ఆర్.ఎస్.ఆర్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళా ను కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ రావతిలోని ప్రముఖ నిర్మాణ సంస్థలతో నెల్లూరు సిటీ నియోజకవర్గ యువత కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నారని తెలిపారు. పట్టభద్రులైన యువత జాబ్ మేళాలోని ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తి కలిగిన ఉద్యోగాలను సాధించాలని కమిషనర్ సూచించారు.

హెచ్ఐవి నివారణకు చర్యలు

ప్రజాశక్తి- నెల్లూరు : ప్రతి ఏడాది మే నెల 3వ ఆదివారం ,హెచ్ఐవితో మృతిచెందిన వారి జ్ఞాపకార్ధం వారి ఆత్మ శాంతి కోసం ఇంటర్నేషనల్ ఎయిడ్స్ కాండిల్ లైట్ రాలీ నిర్వహిస్తారు. ఈ సంవత్సరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టరు సుజాత ఆధ్వర్యంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ ,టీబీ ఆఫీసర్ డాక్టరు ఖాదర్ వలీ నేతత్వం లో "మేము గుర్తుంచుకుంటాం.. మేము మాట్లాడతాము .. మేము నడిపిస్తాము ' అనే నినాదంతో మే 18 వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్వ బి.ఎడ్ కళాశాల నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయం వరకు సుమారు 300 మందితో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ మౌన ప్రదర్శనను డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు సుజాత జెండా ఊపి ప్రారంభించారు. ఇంకా జిల్లా లెప్రసి,ఎయిడ్స్ అండ్ టిబి ఆఫీసర్ డాక్టరు ఖాదర్ వలీ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది, డెమో ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్రంలో ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుందని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బచ్చు దేవిడ్ చిన్నబాబు అన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు ఈ నెల 21వ తేదీన ఉమ్మడి జిల్లాలోని డిఇఒ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ మిత్రులందరూ ఉదయం 9 గంటలకి డిఇఒ కార్యాలయం దగ్గరకు చేరుకొని తమ నిరసన తెలియజేయాల్సిందిగా ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బచ్చు దేవిడ్ చిన్నబాబు ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన రావు తెలియజేశారు. ఆదివారం వారు కోవూరులో పత్రికాయుల సమావేశంలో మాట్లాడారు. అందులో ముఖ్యమైన డిమాండ్స్ వివరించారు. బదిలీలలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ కు మ్యాన్ వల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం కావాలంటే ఒకటి నుంచి ఐదు తరగతులలో 20మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్నారు. ప్రతి బేసిక్ ప్రైమరీ పాఠశాలలో కచ్చితంగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్య తీసుకోవాలని, లేనిచో ఆ పాఠశాలలో కొన్ని సంవత్సరాలకు ఏకోపాధ్యాయ పాఠశాలలుగానే మారే అవకాశం ఉందన్నారు. ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఉపాధ్యాయ నిష్పత్తి 20:1 ఉండాలని, మోడల్ ప్రైమరీ స్కూల్లో 80మంది విద్యార్థులు దాటినచో ఐదు ఎస్జీటీలు, ఎల్ ఎఫ్ హెచ్ ఎం పోస్ట్ ఉండాలన్నారు. దాని తర్వాత ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీ నియమించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాలను ప్రవేశపెట్టాలని, దానికి అనుగుణంగా రెండు మీడియంలో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు 30సంవత్సరాలపైనే సర్వీస్ వున్న ప్రమోషన్స్ రాక రిటైర్ అవుతున్న ఉపాధ్యాయులు ఉన్నారని, ఎల్ ఎఫ్ ఎల్ హెడ్మాస్టర్ పోస్టులను ఎస్జీటీల ప్రమోషన్ ద్వారా మాత్రమే భర్తీ చేయాలన్నారు. ఎస్ఎలకు ఎట్టి పరిస్థితుల్లో ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ గా అవకాశం ఇవ్వకూడదన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఒకటి రెండు మూడు సార్లు రేషనల్ సర్దుబాటుగా ఉన్నారని అందువల్ల వారికి రేషనలైజేషన్ గురికాకుండా ఉన్న పాయింట్స్ ను ఇవ్వాలన్నారు. చెవుడు అంగవైకల్యం కలవారందరినీ స్టేట్ మెడికల్ బోర్డు రెఫర్ చేసిన తరువాత వారిని బదిలీలకు అనుమతించాలన్నారు. వికలాంగుల కేటగిరీని ఉపయోగించుకుంటున్న వారందరి వికలాంగుల శాతం, వికలాంగుల తత్వమును బదిలీల లిస్టులో చూపించాలన్నారు. హైస్కూల్లోని కొంతమంది ఉపాధ్యాయులను హై స్కూల్ ప్లస్ డిప్యుటేషన్ వేసి ఉన్నారు ఆ కాలేజీలో పిల్లలు లేని కారణంగా మీ వారిని ఏ విధంగా కొనసాగిస్తారో అధికారులు తెలియజేయాలన్నారు. బదిలీలకు ముందుగానే స్పెషల్ టీచర్ల సీనియారిటీ జిల్లా వారీగా విడుదల చేయాలన్నారు. బదిలీలలో పారదర్శక కోసం స్కూళ్ల వారీగా పని చేస్తున్నారు అతని వివరాలను కూడా విడుదల చేయాలని తెలిపారు. ఉన్నత పాఠశాలలో 45 విద్యార్థులకు ఒక సెక్షన్ గా గుర్తించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతులకు స్కూల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. ఒక్క పోస్టును కూడా బ్లాక్ చేయరాదన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కోవూరు


వాహనచోదకులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజిత శ్రీహరిరెడ్డి కోరారు. ఆదివారం బాగంగానే ఇనమడుగు రైల్వే గేట్ వద్ద గేట్ వేసిన సమయంలో ఎండ వేడిమిని తట్టుకొనేందుకు గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పడుగుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇనమడుగు సెంటర్లోని రైల్వే గేటు వద్ద మధ్యాహ్నం గేటు వేసి ఉన్న సమయంలో ద్విచక్ర వాహనదారులకు ఎండ వేడిమికి రక్షణ కోసం గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పడుగుపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ చౌటూరు లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి హజరత్ బాబు పాల్గొన్నారు.



పద్మశాలి ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

జీవితంలో ఉన్నత స్థానానికి చేరడానికి విద్య ఆయుధమని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మలవతు వెంకట సుధాకర్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పాత కాశీపాలెం స్థానిక భావనా ఋషీశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, జ్ఞాపిక, మెడల్తో సత్కరించి అభినందించారు. తల్లిదండ్రులు పిల్లలను లక్ష్యంగా చదివించి క్రమశిక్షణతో మెలిగేలా చూడాలన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాదని, పేద పద్మశాలి విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పిల్లలు సమాచార మాధ్యమాలకు దూరంగా ఉండి, గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో చేపూరు చలమయ్య, దొనిసర్తి శ్రీహరి మల్లికార్జున, కడిమి వెంకట శేషయ్య, గండికోట సుధీర్ కుమార్, పోలిశెట్టి నరసయ్య, అంథంగిరి వెంకట సుబ్బారావు, కాసుల జనార్దన, మిట్టదొడ్డ సురేంద్రబాబు, కొనిపాటి కోటేశ్వరరావు, మామిళ్ళ మల్లికార్జున, జొన్నలగడ్డ రమేష్, తమ్మలచెర్వు రాధాకృష్ణయ్య, మిట్టదొడ్డ పెంచల ప్రసాద్, వర్దుల శ్రీరాం ప్రసాద్, ఇష్టం శెట్టి సుబ్బయ్య, అందె శివకుమార్, తాటికొండ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



కరాటే నేర్చుకోవాలి..

ప్రజాశక్తి-బిట్రగుంట

పిల్లలకు యువతకు ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని అంతర్జాతీయ కరాటే మాస్టర్ రవి గన్ పేర్కొన్నారు. ఆదివారం బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ కరాటే క్లాసులను రవి గన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మన్యం శ్రీనివాసులు ప్రత్యేక ట్రీట్ ఏర్పాటు చేశారు. సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్కాల్, సెక్రెటరీ ఫౌండర్ కందుర్తి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు సూక సాని శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు స్వర్ణ్ రాజ్ పాల్గొని మాట్లాడుతూ మానసిక వికాసానికి క్రీడలు చాలా అవసరమని, పిల్లలు చిన్నప్పటి నుండి కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుందని చదువుల్లో బాగా రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అర్జున్ అసోసియేషన్ సభ్యులు జీవన్ కుమార్, అరుణ్ కుమార్, సత్యం, మురళి, శేఖర్, శ్యాంసుందర్, పుల్లయ్య, ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు శ్రీహరిబాబు, మనోహర్ నాయుడు, సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రెడ్డి, తోటపల్లి ఎజ్రా, సుబ్బారాయుడు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, రైల్వే విశ్రాంతి ఉద్యోగులు, ఆర్మీ విశ్రాంతి ఉద్యోగులు, తదితరులున్నారు.



కుంభాభిషేక మహోత్సవం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పునఃప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన కుంభాభిషేకం మహోత్సవంలో కావలి జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ ఆర్య వైశ్య సంఘం వారి ఆహ్వానం మేరకు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. శృంగేరి పీఠాధిపతి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పొల్లా శ్రీను, అలా శ్రీనాథ్, మస్తాన్, శ్రీను, సాధు శ్రీధర్, వెంకయ్య, మండ శ్రీను, తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

జెవివి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎమ్‌వి సుబ్బారెడ్డి అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక మండల మహాసభకు సంబంధించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలకు జెవివి రాష్ట్ర సమన్వయ కర్త కె.శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞాన ప్రచారం, మూఢనమ్మకాల నిరోధం, సామాజిక సమస్యలపై చర్చ, విద్య, ఆరోగ్యం, పర్యావరణం, పలు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే టీ కప్పులు, పేపర్ ప్లేట్లలో ప్లాస్టిక్ ఉండడం వల్ల, కూల్‌డ్రింక్స్‌లో రసాయనాలు ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజలు వాటిని సేవించడంతో అనారోగ్య సమస్యలు వస్తాయని తెలియజేశారు. వీటికి వ్యతిరేఖంగా స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, పర్యావరణ వేత్తలు, మేధావులు కూల్‌డ్రింక్స్‌ను నిషేధించాలని ఆందోళనలు చేశారని గుర్తు చేశారు. అనంతరం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, వైసిపి మాజీ మండలాధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక కళాకారులు గ్రామాల్లోకి నాటికల ప్రదర్శనల ద్వారా ప్రజల్లో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను పారద్రోలెందుకు కృషి చేస్తున్నారన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజక వర్గాలకు వరప్రసాదిని అయిన సోమశిల హై లెవల్ కెనాల్ పనులు పూర్తి అయ్యేందుకు అందరూ ఉద్యమించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరంతరం రోగులకు సేవలు అందిస్తున్న డాక్టర్ గోపీనాథ్‌ను మండల నూతన కమిటీ, జెవివి నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. జెవివి గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గోపీనాథ్, అరికట్ల పుల్లయ్య నాయుడు, మండల అధ్యక్షులు ఎమ్‌వి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు కె శ్రీనివాసులు, కె వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఎస్కె రసూల్ బాబు, సమన్వయ కర్త కె పోలయ్య, కోశాధికారి ఎం సుబ్బారాయుడు, కమిటీ సభ్యులుగా బి రత్నయ్య, వెంకటముని, మూలి ప్రమీల ఎస్ కె రహంతుల్లా, కామాక్షమ్మ, ప్రభాకర్, కె పెద్దనరసింహులు, తరుణ్, పగడాలనాగభూషణం రెడ్డి, తమ్మిశెట్టి శ్రీనివాసులు, సలహా మండలి సభ్యులుగా మూలి వెంగయ్య, శ్రీనివాసులు నాయుడులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు



ఎన్నికైన జెవివి నూతన కమిటీ



విగ్రహ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి-కావలి : కావలిలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ పునఃప్రతిష్టాపనా కార్యక్రమం వేడుక ఘనంగా నిర్వహించారు. శృంగేరి శారదా పీఠాధీశ్వరులు విధుశేఖర భారతీ సన్నిధానం చేతులమీదుగా విగ్రహాన్ని ప్రతిష్టించారు. మహా కుంభాభిషేకం నిర్వహించి, వేడుక జరిపించారు. అవివాహిత దేవతాపూజ, ప్రాణ ప్రతిష్ట, ప్రతిష్టాంగ, పూజాంగ హోమాలు, మహా పూర్ణాహుతి, కలశప్రోక్షణ, మహాదాశీర్వాదం, రుత్విక్ సన్మానం తదితర వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు కందుకూరి వెంకటసత్యనారాయణ, గ్రంధి రమేష్, కార్యదర్శి చీదెళ్ల రామచంద్రరావు అధ్యక్షులు ఒలేటి నాగేశ్వరరావు, కార్యదర్శి చీదెళ్ల రామచంద్రరావు, కోశాధికారి నల్లూరి రోశయ్య, కమిటీ సభ్యులు, పాల్గొని స్వీకరించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి ఆనం, తదితరులు

తిరంగా యాత్ర ర్యాలీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఇటీవల పాకిస్తాన్ ఉగ్రవాది దాడికి గురై 27మంది ప్రాణాలు అర్పించడంతో దానికి ప్రత్యేకగా కేంద్ర ప్రభుత్వం మోడీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పూర్తిస్థాయిలో విజయవంతమై శత్రుదేశం చేసిందని ఇది దేశానికి ఎంతో గర్వకారణమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. సాయంత్రం పార్టీలకతీతంగా ఆత్మకూరు నియోజకవర్గం ప్రజలు అధికారులు తను పార్టీల నాయకులు కార్యకర్తలు మహిళలు విద్యార్థులతో తిరంగా యాత్ర నిర్వహించారు. యాత్ర మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. యాత్రను ఆయన ముందుండి నడిపించారు. పోలీస్ స్టేషన్ బిఎస్ఆర్ సెంటర్, మున్సిపల్ బస్టాండ్ మీదుగా సత్రం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సైనికులకు అండగా ఉండాలని ఇదే స్ఫూర్తిని దేశ రక్షణలో ప్రతి ఒక్కరు కనపరచాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్ విజయాన్ని గుర్తిస్తూ భారత సైనికులు పరాక్రమ వీరత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని, మున్సిపల్ చైర్మన్ గోపారం వెంకటరమణమ్మ, మున్సిపల్ కమిషనర్ గంగప్రసాద్, డిఆర్‌డిఎ పిడి, తహశీల్దార్ సోమ్లా నాయక్ ఎన్‌డిసిసిబి బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, టిడిపి నాయకులు తాళ్లూరు గిరి నాయుడు, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, కె.రవీంద్ర రెడ్డి, దావా పెంచలరావు, కేత విజయభాస్కర్ రెడ్డి, సుంకర పెంచలయ్య చౌదరి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల కరెన్సీ ప్రదర్శన

ప్రజాశక్తి కోవూరు



కోవూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సమ్మర్ క్యాంపులో భాగంగా ఆసక్తికరమైన కరెన్సీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎఎస్‌పేటకు చెందిన వాయిజ్ అహ్మద్ తన ప్రపంచ దేశాల కరెన్సీ సేకరణను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి పిల్లలు విశేషంగా హాజరై ఇతర దేశాల కరెన్సీతో పాటు, భారతదేశపు పాత కరెన్సీ గురించి ఎంతో ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కరెన్సీ సేకరణ కర్త వాయిజ్ అహ్మద్‌ను గ్రంథాలయ సిబ్బంది మరియు అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిడి ఎంఆర్ఒ బి.సురేంద్ర, ఉపాధ్యాయులు వై.మునీంద్ర, పి.రంగారెడ్డి, విశ్రాంత ఉద్యోగి ఆర్.సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. లైబ్రేరియన్ జె.సురేంద్ర రెడ్డి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. పిల్లలకు విజ్ఞానాన్ని అందించే ఇలాంటి కార్యక్రమాలు గ్రంథాలయంలో నిర్వహించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైసిపి ప్రభుత్వ విద్యావిధానం మార్చాలి

ప్రజాశక్తి-కావలి

సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం ప్రారంభించిన పాఠశాల విద్యావిధానాన్ని తక్షణమే మార్పు చేయాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు చాకలకొండ శారద ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వ అక్రమ విద్యా విధానాన్ని నేటి కూటమి ప్రభుత్వం మారుస్తుందని, ఉపాధ్యాయులు ఎంతో ఆశించి, కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారన్నారు. కానీ, క్లస్టర్ విధానం ఏర్పాటు చేసి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలలో తరగతులను మార్పు, చేర్పులు చేసి, అర్థం లేకుండా విలీనాలు చేసి, అయోమయానికి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విద్యార్థులను గురిచేయడం బాగాలేదన్నారు. గతంలో యెన్నేళ్ల నుండో 1 నుండి 5 తరగతులను ప్రాథమిక, 1 నుండి 7 తరగతులను ప్రాథమికోన్నత, 6 నుండి 10 తరగతులను ఉన్నత పాఠశాలలుగా స్థిరీకరించినట్లే చేస్తే, ఈ అయోమయం తొలుగుతుందన్నారు. 1:40 ఒక సెక్షన్‌గా, తరగతికి ఒకరు లేక ఇద్దరు టీచర్లను కనీసం ఏర్పాటు చేయడం సబబుగా ఉంటుందని ఆమె సూచించారు. అంతగా కావాలంటే హై స్కూల్, స్కూళ్లను ఏర్పాటు చేయవచ్చన్నారు. అది అభివృద్ధికి సూచిక అవుతుందన్నారు. ఎయిడెడ్ స్కూళ్లలో రిటైర్ అవగా ఖాళీ అయిన బోధన - బోధనేతర సిబ్బంది ఖాళీలను ఈ విద్యా సంవత్సరంలోనే పూర్తి చేసి పేదబడుగు విద్యార్థులకు మేలు చేయాలని కోరారు. ఆయా స్కూళ్లకు అనుబంధంగా ఉన్న ఎస్.సి, ఎస్.టీ, బిసి సంక్షేమ హాస్టళ్ల భవనాలను మరమ్మతులు చేయించి, మరుగు దొడ్లు, మంచినీరు, మురుగునీటి వసతులు కల్పించాలన్నారు. కార్పొరేట్ - ప్రయివేట్ పాఠశాలల్లో కాకుండా టీచింగ్ ట్రైనింగ్ ఉన్న ఉపాధ్యాయులుండే ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులు విద్యను అభ్యసించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఇష్టపడి తెచ్చుకున్న ఈ కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని తప్పక పునరుద్ధరిస్తుందని ఆమె ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



టిడిపి నేతలతో ఎంఎల్ఎ సమావేశం

ప్రజాశక్తి-వింజమూరు

జలదంకి మండలం కమిటీ సమావేశం టిడిపి ప్రధాన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జలదంకి మండలం, గ్రామ నాయకులు హాజరయ్యారు. జలదంకి మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఎంఎల్ఎ చర్చించారు. పార్టీ ఆదేశాల మేరకు పార్టీ పదవులపై సమీక్షించారు. అన్ని సామాజిక వర్గాలను కలుపుకుంటూ పదవులు వచ్చేలా ప్రణాళికలు చేయాలని తెలియజేశారు. పార్టీ విధివిధానాలను తెలుసుకొని పాత, కొత్త కలయికలు ఐకమత్యంతో మెలగాలన్నారు. అందరినీ కలుపుకొని పోతూ పార్టీని ముందుకు నడిపించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోనికి తీసుకుపోవాలని తెలియజేశారు. అనంతరం జలదంకి మండల కమిటీ పేర్లను నమోదు చేసుకున్నారు. అందరి ఆమోదంతోనే కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎంఎల్ఎ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుమోహన్ రెడ్డి, ముఖ్యనేతలు, మండల నాయకులు తదితరులున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

- విశాఖపట్నం, తూర్పు గోదావరి జట్లు విజయం

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు మండలం, పాటూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్ - 2025-26 ఆదివారం ఉత్కంఠభరితంగా ముగిసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఈ క్రీడా సంబరానికి ముఖ్య అతిథిగా టార్గెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ విచ్చేశారు. గత ఐదు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ జట్టు నిలకడగా పతకాలు సాధిస్తోందని ఆయన కొనియాడారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉందని గుర్తు చేస్తూ, క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని ఆయన ఆకాంక్షించారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భీమతాటి వెంకటరమణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో టార్గెట్ బాల్ క్రీడ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. క్రీడాకారులంతా క్రమశిక్షణతో ఆడాలని సూచించారు. తొమ్మిది జిల్లాల జట్లు పాల్గొన్న ఈ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం జట్టు రన్నర్‌గా, తూర్పు గోదావరి జట్టు మూడో స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో తూర్పు గోదావరి జట్టు ఛాంపియన్‌గా అవతరించగా, పశ్చిమ గోదావరి జట్టు రెండో స్థానంలో, నెల్లూరు జట్టు మూడో స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో టార్గెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భీమతాటి వెంకటరమణయ్య, రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ చిట్టిబాబు, జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బట్టా పాల్ విల్సన్, జాయింట్ సెక్రటరీ పులివెందుల మల్లికార్జున రావు, పారిశ్రామికవేత్త బడికాల శంకర్ రఘునాథ్, టిడిపి నాయకులు గోనెల శ్రీనివాసులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎన్ వెంకటేష్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



మెడల్స్‌తో విజేత జట్టు

ముగిసిన ఉజ్జీవ మహాసభలు

ప్రజాశక్తి-దుత్తలూరు

తెడ్డుపాడు ఎస్‌సి కాలనీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో గురువారం నుండి మొదలైన ఉజ్జీవ సువార్త మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పాస్టర్ ఆనందరావు, కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ టి.చిన్నబాబు, వందనం, సెక్రటరీ బి.ఎఫ్రాతా మాట్లాడుతూ ప్రతేడాది మే లో ఈ ఉజ్జీవ సువార్త మహాసభలను నిర్వహిస్తామని అలాగే 3 రోజులు జరుగు సువార్త మహాసభలకు వ్యాక్యోపదేశం చేయడానికి మొదటి రోజు నెల్లూరుకు చెందిన బ్రదర్, యేసుబాబు, రెండవ, మూడవ రోజు బ్రదర్ బెంజిమెన్, సంఘ కాపరి ఆనందరావు పాల్గొని బైబిల్ విశిష్టతను క్రైస్తవ సోదర సోదరీమణులకు వివరిస్తారన్నారు. ఈ ఉజ్జీవ సువార్త మహాసభలకు చుట్టూ పక్కల గ్రామాల నుండి సుమారు రోజుకి 400నుండి 500 మంది హాజయారని తెలిపారు. అలాగే మూడు రోజులు పిల్లలకు సిబిసిఎస్ క్లాస్‌లు నిర్వహించారు. గ్రామానికి చెందిన తాళ్లూరి రాజామోహన్, చర్చి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఆత్మకూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు మున్సిపాలిటీకి చెందిన కందుకూరి మనో జస్వంత్, ఎస్.వెంకట విఙ్ఞేష్ అనే విద్యార్థులు గోవాలో జరిగిన జాతీయస్థాయి జూనియర్ రౌండ్ నెట్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించారు. మే 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు గోవా రాష్ట్రంలోని బిచోలిమ్, ఛత్రపతి శివాజీ మహారాజ్ మైదానంలో జరిగిన జాతీయ జూనియర్ స్థాయి రౌండ్ నెట్‌బాల్ పోటీలు జరిగాయి. కందుకూరి మనో జస్వంత్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున కుమారుడు, పట్టణంలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఎస్ వెంకట విఙ్ఞేష్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించిన మనో జస్వంత్, వెంకట విఙ్ఞేష్‌లకు, తర్ఫీదునిచ్చిన పీడీ పచ్చా తిరుపతయ్యకు ఆత్మకూరు ప్రాంత ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

జొన్నవాడ గ్రామంలో పినాకిని నదితీరాన కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమానికి సకల దేవతలను ఆహ్వానిస్తూ ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పాటూరు వాస్తవ్యులు వుఖ్యం శివకుమార్, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ధ్వజారోహణ కార్యక్రమం అనంతరం ప్రసాద వితరణగా కొడిముద్దలను భక్తులకు పంచిపెట్టారు. కొడి ముద్దుల కోసం మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంతానం లేని వారు కొడిముద్ద తింటే అమ్మవారి అనుగ్రహంతో సంతాన భాగ్యం కలుగుతుందని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, స్థానిక శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయ ప్రాంగణంలో రాత్రిపూట నిద్రిస్తే స్వప్నంలో అమ్మవారు కనపడి వారి కోర్కెలను తీరుస్తుందని పురాణాలు చెబుతున్నాయని ఆయన తెలియజేశారు. బ్రహ్మోత్సవాలలో విశేషంగా 23వ తేదీ శుక్రవారం రావణ సేవ, 24వ తేదీ శనివారం వెండి నందిసేవ, 25వ తేదీ ఆదివారం రథోత్సవం, 26వ సోమవారం ఉదయం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం, రాత్రికి తెప్పోత్సవం కన్నుల పండుగగా జరుగుతాయన్నారు. అత్యంత వైభవముగా జరగనున్న ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల తరలి వచ్చి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆర్య భూమి శ్రీనివాసులు రెడ్డి, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా నిర్వహిస్తున్న ధ్వజారోహణం



జొన్నవాడ ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి